
# గర్భస్థ శిశులింగ నిర్ధారణ నిషేధ చట్టం
# శిక్షణా దీపిక




**చేయి చేయి కలుపుదాం ఆడపిల్లలను రక్షిద్దాం**

---

గ్రామ్య, పిలుపు, పీస్, తరుణి, రెడ్స్, ఎస్.వి.కె, గ్రాస్, ఏ.ఎస్.డి.ఎస్, ఏ.ఆర్.డి, షాహిన్, నిసర్గ, మహిళా యాక్షన్, ఎఫ్.వై.డబ్ల్యూ.ఏ, జి.ఎస్.ఎస్, సి.సి.సి, ఆశ్రిత, ఎస్.సి.ఎ.ఎఫ్.ఎన్, ఎన్.సి.ఎ.ఎఫ్.ఎన్, యాక్షన్ ఎయిడ్

# ముందుమాట

స్త్రీ పురుషులు లేని మానవ సమాజం ఊహకందనిది. పితృస్వామిక భావజాలం నిండి వున్న ప్రపంచంలో మనం జీవిస్తున్నాం. మానవ నాగరిక సమాజ పురోగమానానికి పురుషుడే ఆద్యుడనే తప్పుడు భావన ప్రచారం చేయబడింది. దీనితో స్త్రీ స్థానం కేవలం పునరుత్పత్తి సాధనంగానే పరిమితం చేసారు. స్త్రీ కేవలం పిల్లలను కనే యంత్రం కాదు. గర్భం దాల్చినప్పటి నుండి శిశువుకు జన్మనిచ్చేంత వరకు క్షణక్షణం తన ప్రతిరూపాన్ని పెంచిపోషిస్తుంది. తన పిల్లల పెంపకం బాధ్యత తీసుకునే తల్లి ఈ నాగరిక సమాజానికి మంచి మనిషిని అందించేందుకు నిరంతరం ప్రయత్నిస్తుంది. ఇంతటి కీలక పాత్ర వహిస్తున్న స్త్రీని వస్తువుగా చూస్తున్న ఈ సమాజం పట్ల అప్రమత్తంగా ఉండాలి. మావన జాతిని ఉత్పత్తి చేస్తున్న స్త్రీలకు మన సమాజంలో ఎలాంటి స్థానం ఉందో ప్రశ్నించాలి.

గడచిన రెండు దశాబ్దాల నుండి సమాజంలోని స్త్రీ పురుష నిష్పత్తి వేగంగా తగ్గుతుంది. ఇందుకు కారణాలు చాలా ఉన్నప్పటికి వైద్య రంగంలో వచ్చిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేయడం ప్రధాన కారణం. ఇది వికృత రూపం దాల్చి గర్భంలోని శిశు లింగాన్ని తెలుసుకుని బాలిక అని తెలిస్తే అబార్షన్ చేయించే నాగరిక క్రూరత్వం విచ్చలవిడిగా పెరిగిపోతుంది. వీటిని నిషేధించేందుకు 1994లో PCPNDT చట్టం వచ్చింది. ఈ చట్టాన్ని కఠినంగా అమలుచేయడంలో ప్రభుత్వాల వైఫల్యాన్ని 20 సంవత్సరాల జనాభా లెక్కలే స్పష్టం చేశాయి.

గ్రామాలలో గర్భందాల్చిన స్త్రీల సంరక్షణ మరియు బాలింతల బాగోగులు చూసే అంగన్‌వాడీ టీచర్లకు ఆశావర్కర్లకు అవగాహన కల్పించేందుకు ఈ కరదీపిక ఉద్దేశించబడింది. యాక్షన్ ఎయిడ్ మరియు ఇతర సంస్థలు కలిసి చేస్తున్న బాలిక పరిరక్షణ ప్రచారంలో భాగంగా ఈ కరదీపికను మీ ముందుకు తెస్తున్నాం. ఈ ప్రచారంలో భాగంగా వచ్చిన అనుభవాల ద్వారా తెలిసిన విషయం ఏమిటనగా PCPNDT పై వీరికి అవగాహన లేదని అందుకే ముందస్తుగా గ్రామాలలో ప్రధానపాత్ర పోషించే వీరికి అవగాహనను కల్పించాలని మా ప్రయత్నం. మీ శిక్షణ అనుభవాలతో మరింతగా ఈ కరదీపికను మెరుగుపర్చడానికి తగిన సలహాలు, సూచనలు మాకు పంపండి. భవిష్యత్తులో వాటిని వినియోగించడానికి దోహదపడుతుంది.

2001 జనాభా లెక్కల ప్రకారం 0–6 సం॥లు సగటున వెయ్యి మంది బాలురకు 961 బాలికలు ఉండగా 2011కు 939కి తగ్గడం జరిగింది. ఈ సంఖ్యను మరింత క్షీణించకుండా అమ్మాయిల సంఖ్య పెంచటానికి ప్రజలలోకి అవగాహన కొరకై ఈ శిక్షణా దీపికను తయారుచేయడం జరిగింది. ఇందుకు సహకరించిన కొండేపూడి నిర్మల గారికి మా అందరి తరఫున ధన్యవాదాలు.

# పరిచయం

**ఇందులో వున్న అంశాలను బోధన సౌలభ్యం కోసం మూడు విభాగాలుగా వర్గీకరించడం జరిగింది.**

**దృక్పథం :**

పరిచయం దగ్గరనుంచి వస్తువు మీదే దృష్టి కేంద్రీకరించి శిక్షితుల ప్రస్తుత స్థితి అంచనా వేసేందుకు ప్రత్యుత్పత్తి రంగం గురించిన మేథోమథనం వుంది. ఉదాహరణకు, కుటుంబం నడవడానికి ఏం కావాలి అని అడుగుతూనే, భావజాలం గురించి, భయాల్ని, భ్రమల్ని తొలగించుకునే శాస్త్రీయ అవగాహనకు పునాదిని వెయ్యడానికి ప్రయత్నం జరిగింది. నిజానికి వివక్ష గురించి ఎన్ని రోజులు చెప్పుకున్నా తరగని అంశాలు అనేకం వున్నాయి. సమయ పరిమితి వల్ల వాటిని ప్రస్తావించలేదు.

**అవగాహన :**

ఉన్న వాస్తవాల పట్ల శిక్షితులకి కొత్త విషయాలను పాత అనుభవాల నేపథ్యంలో చెప్పేందుకు ఎంచుకున్న "పూసల ఎంపిక" ఆటలో క్రోమోజోముల గురించి చెప్పడం జరిగింది. "ఈ నేరం మీరూ చేశారా..?" అంటూ సంధించిన ప్రశ్న కొన్ని సంఘటనలు, వాస్తవాలను బైట పెడుతుందని ఆశిస్తున్నాను.

ఆ దిశగా ఫెసిలిటేటర్ నడవాల్సి వుంది. ఎందుకంటే జరుగుతున్న తప్పులన్నీ అవగాహన లేక కాదు మైండ్ సెట్ రిపేరు కాక జరుగుతున్నాయి.

**కార్యాచరణ :**

గర్భస్థ శిశువు ఆరోగ్య పరీక్షకూ, లింగ నిర్ధారణ పరీక్షకూ తేడా దగ్గరనుంచి రాత ప్రతులు ఇవ్వడం, అది బోర్ కొట్టకుండా చూడ్డం కాస్త కసరత్తే . అయినా ఈ సెషన్ లో చదివి, విని తెలుసుకోవాల్సింది ఎక్కువ వుంది. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎలాంటి శిక్షలుంటాయో కూడా తెలుసుకోవడం తప్పనిసరి. యాక్షన్ ప్లాన్ ఎలా వుంటే బావుంటుంది అనేది శిక్షితులు నిర్ణయించుకోవాల్సిన విషయం. కాకపోతే వారిని మోటివేట్ చెయ్యడానికి కొన్ని పాయింట్స్ పొందుపరచడం జరిగింది.

ఇందులో శిక్షితుల క్షేత్ర స్థాయి అనుభవాలకి ఎంతో ప్రాధాన్యత వుంది. ప్రతిసారి ట్రెయినింగ్ మినిట్స్ కనక తీసుకుంటే మరికొన్ని అంశాల చేరిక తప్పనిసరిగా వుంటుంది. కాబట్టి మార్పులకి చేర్పులకి ఎక్కువ అవకాశం వుంటేనే బావుటుందని నమ్ముతున్నాను.

# విషయసూచిక

1. పరిచయాలు
2. కుటుంబం మరియు వంశం నడవటానికి ఎవరు అవసరం?
3. భావజాలం ఎవరు తయారు చేస్తారు..?
4. స్త్రీల ప్రత్యుత్పత్తి శక్తిని ఎలా గౌరవిస్తున్నాం..?
5. మూఢ నమ్మకాలు మతి పోగొడతాయని తెలుసా..?
6. కంసుడి సంస్కృతి మనకింకా వుంది
7. గర్భస్థ శిశువుకి లింగం ఎలా ఏర్పడుతుంది?
8. గర్భస్థ పిండాల్లో ఆడ శిశువులే ఎందుకు తొలగించబడుతున్నారు?
9. ఈ నేరం మీరూ చేశారా..? ఆలోచించండి..
10. గర్భస్థ శిశు ఆరోగ్య పరీక్షకూ, లింగ నిర్ధారణ పరీక్షకూ వున్న తేడా ఏమిటి..
11. కడుపులో చిన్నారిని ఎలా కాపాడుకుందాం..?
12. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎలాంటి శిక్షలు వుంటాయి..?జన్యు పరిధిలోకి వచ్చే కేంద్రాలు
13. సుప్రీంకోర్టు వెలువరించిన మార్గదర్శకాలు
14. ఎంత పెద్ద ప్రయాణమయినా ఒక అడుగుతోనే మొదలవుతుంది

# శిక్షణా ప్రణాళిక

| అంకె | అంశం | ఉద్దేశ్యం | విధానం | కాలం |
|---|---|---|---|---|
| | పరిచయాలు | పితృస్వామ్య వ్యవస్థ పరిచయం | శిక్షణకు వచ్చిన ఆడ మగ సభ్యులను వారిదగ్గరున్న నోట్ పుస్తకాలలో ఒక కాగితం మీద వారి ఇంటిపేరుతో బాటు సొంత పేరు రాసి ఇవ్వమని అడగాలి. | 30 ని॥లు |
| 2 | కుటుంబం మరియు వంశం నడవడానికి ఎవరు అవసరం. | స్త్రీ పురుషులిద్దరూ అవసరం. లేనిచో మనుగడ ప్రశ్నార్థక మవుతుంది. | 1,2 నంబర్లు ఇచ్చి తర్వాత వారిని జంటలుగా చేసి ఉద్దేశ్యాన్ని వివరించాలి. | 15 ని॥లు |
| S-2<br>3 | భావజాలం ఎవరు తయారు చేస్తారు..? | జండరు మూలాల గురించి తెలుసుకోవడం స్త్రీ, పురుషులు ఎంత మూస విధానాలలో ఆలోచిస్తున్నారో తెలుస్తుంది. ఇది తర్వాతజరగబోయే ఇతర శిక్షణా అంశాలకు ఉపయోగపడుతుంది. | సెక్స్ జండర్ అంటే నిర్వచనాలు ఏమిటో అడిగి వాటిని వివరించి జండర్ మూలాలు గురించి పవర్ పాయింట్ ద్వారాకాని తను తయారు చేసుకున్న చార్టుద్వారా కానీ బోర్డు మీద కానీ రాసి అర్థమయ్యేలా చెప్పాలి. | 15 ని॥లు |
| | Tea Break | | | |
| 4 | స్త్రీల ప్రత్యుత్పత్తి శక్తిని ఎలా గౌరవిస్తున్నాం..? | స్త్రీ పురుషుల శ్రమ విలువల్ని ఎంత ద్వంద్వ వైఖరితో చూస్తున్నామో చెప్పడానికి ఇది ఉపకరిస్తుంది. | ఉత్పత్తి ప్రత్యుత్పత్తి అంటే ఏమిటి చర్చ జరిపి జవాబులు రాబట్టాలి.<br><br>మానవ జాతిని ఉత్పత్తి చేస్తున్న స్త్రీలకు మన సమాజంలో ఎలాంటి స్థానం వున్నదో ప్రశ్నించాలి. | 45 ని॥లు |
| S-3<br>5 | మూఢ నమ్మకాలు మతి పోగొడతాయని తెలుసా..? | హేతుబద్ధమయిన ఆలోచనకు పునాది పడుతుంది. | క్లాసులో వున్న సభ్యులందర్నీ ఆ శక్తుల్ని నమ్మేవారు, నమ్మనివారు అని రెండు గ్రూపులుగా స్వచ్ఛందంగా ముందుకు రానిచ్చి ఎ.బి అని పేర్లు పెట్టి చర్చ నడిపించాలి. | 25 ని॥లు |


| అంకె | అంశం | ఉద్దేశ్యం | విధానం | కాలం |
|---|---|---|---|---|
| 6 | కంసుడి సంస్కృతి మనకింకా వుంది | సెక్స్ సెలక్టివ్ మర్డర్స్ ఎప్పుడయినా కానీ దుష్పరిణామాలకే దారితీశాయని తెలుసు కోవడానికి ఈ పౌరాణిక నేపథ్యం ఉపయోగపడుతుంది | కథ చెప్పి కొన్ని ప్రశ్నలు వేయడం ద్వారా చర్చలు చేయాలి. | 20 ని॥లు |
| S-4<br>7 | గర్భస్థ శిశువుకి లింగం ఎలా ఏర్పడుతుంది. | ఈ క్రీడ వల్ల గర్భస్థ పిండ లింగం అనేది మనుషుల ప్రమేయంతో కాక క్రోమోజోన్స్ వల్ల ఏర్పడుతుంది. ఇలా వ్యతిరేకించడం, మార్చడం చాలా అనాచారమని, అనాగరికత అని తెలుస్తుంది. | రంగు పూసల ఆట ద్వారా చర్చ | 15 ని॥లు |
| 8 | గర్భస్థ పిండాల్లో ఆడ శిశువులే ఎందుకు తొలగించబడుతున్నారు. | శిక్షకుల ప్రశ్నలన్నింటికి జవాబులు పూరించడం వల్ల ఆడపిల్లల మీద అమలవుతున్న వన్నీ సామాజిక రుగ్మతలని వాటిని వ్యతిరేకించాలి తప్ప బాధితుల్ని హింస పెట్టకూడదని తెలుస్తుంది | ప్రశ్న – జవాబులు | 15 ని॥లు |
| | Lunch | | | |
| S-5<br>9 | ఈ నేరం మీరూ చేశారా..?<br>ఆలోచించండి..? | ఎవరికి వారు ఆత్మవిమర్శ చెసుకోవడానికి ఉపయోగపడుతుంది. | యాక్షన్ ఎయిడ్ వారి డాక్యుమెంటరీ ఫిల్మ్ ప్రదర్శన. అభిప్రాయసేకరణ. | 15 ని॥లు |
| 10 | గర్భస్థ శిశు ఆరోగ్య పరీక్షకూ, గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షకూ వున్న తేడా ఏమిటి..? | దీనివల్ల చట్టం ఎలా దుర్వినియోగం అవుతున్నదో అర్థమవుతుంది. | గ్రూపు చర్చలు | 30 ని॥లు |
| S-6<br>11 | కడుపులో చిన్నారిని ఎలా కాపాడుకుందాం..? | ఈ ఆట సరదాగా ప్రారంభమయినా కానీ, క్రమ క్రమంగా ఒక భావోద్వేగంతో కూడిన నిబద్ధత, ఆలోచన వస్తాయి. అమ్మాయిలను ఎలా కాపాడుకోలేకపోతున్నామో తెలుస్తుంది. | గద్ద, కోడిపిల్ల ఆట<br>ప్రశ్నలు – జవాబులు | 15 ని॥లు |

| అంకె | అంశం | ఉద్దేశ్యం | విధానం | కాలం |
|---|---|---|---|---|
| 12 | చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎలాంటి శిక్షలు వుంటాయి..? | తమ గ్రామంలో కొనసాగుతున్న విధాన వైఫల్యాలు వెలుగులోకి వస్తాయి | ప్రశ్న-జవాబు<br>గ్రూపు చర్చలు | 30 ని॥లు |
| S-7<br><br>13 | సుప్రీంకోర్టు వెలువరించిన మార్గదర్శకాలు | ఇవి చదివి రాయడంవల్ల చట్టపరమయిన విషయాలు తెలుస్తాయి | సమాచార పత్రాలు, సందేహాలు, జవాబులు | 30 ని॥లు |
| 14 | ఎంత పెద్ద ప్రయాణమయినా ఒక అడుగుతోనే మొదలవుతుంది | దీని వల్ల శిక్షితులకు పూర్తి స్థాయి అవగాహన రావడం మాత్రమే కాక తను ఏం చేయగలడొ ప్రకటించడం జరుగుతుంది. ఈ అంకిత భావం కొందరిలో బాగా పనిచేస్తుంది | గ్రూపులు, వివరణ మరియు ప్రతిజ్ఞ | 1 గంట 30 ని॥లు |

**సూచన :** శిక్షణా అంశాల్ని సులభ శైలిలో వివరించడానికి వస్తు స్వభావాన్ని బట్టి ఏడు సెషన్స్ గా వర్గీకరించడం జరిగింది.

ఇందులో అవసరమయినన్ని ఐస్ బ్రేకర్స్, డాక్యుమెంటరీ చిత్రాలు వుంటాయి. శిక్షితులు తీసుకునే సమయం, ఫెసిలిటేటర్ తీసుకునే సమయం లాంటివన్నీ ప్రణాళికాత్మకంగా రాయడం జరిగింది.

# 1. పరిచయాలు



**పరిచయం చేసుకోవడానికి ఫెసిలిటేటర్ కు సూచనలు**

శిక్షణకు వచ్చిన ఆడ మగ సభ్యులను వారిదగ్గరున్న నోట్ పుస్తకాలలో ఒక కాగితం మీద వారి ఇంటిపేరుతో బాటు సొంత పేరు రాసి ఇవ్వమని అడగాలి. స్త్రీలందదరూ తమ పేరుతో బాటు తండ్రి ఇంటిపేరు కాక మామ ఇంటిపేరు రాస్తారు. అవివాహితులు మాత్రమే పుట్టింటి పేరు రాస్తారు.

పురుషులు మాత్రం తన పేరుతో బాటు తన తండ్రి ఇంటి పేరును రాస్తారు. మామ ఇంటి పేరును ప్రస్తావించరు.

**కావల్సిన పరికరాలు :** నోట్ బుక్స్, పెన్స్

**ఉద్దేశ్యం**

ఆడవారు చెప్పేటప్పుడు తండ్రి  ఇంటి పేరు కాక తన మామ ఇంటి పేరు చెప్పడం గమనించగలుగుతాం.

పైన గమనించిన దానిని బట్టిపురుషులు తనను కని పెంచిన వారి ఇంటి పేరు చెప్పినట్టు స్త్రీలు తనను పెంచిన ఇంటిపేరు చెప్పకపోవడాన్ని గమనించగలుగుతాం. మాతృస్వామ్య కుటుంబ వ్యవస్థలో తల్లి ఇంటిపేరు పిల్లలకు వర్తిస్తుందని వివరించాలి. మొదట ఈ ప్రపంచంలో మాతృస్వామ్య కుటుంబ వ్యవస్థ నడిచిందని చెప్పాలి. అంతేకాదు మాతృస్వామ్య వ్యవస్థలో పురుషుల్ని అత్యాచారం చేయడం, మగబిడ్డని చంపడం వున్నాయా..? అని ప్రశ్నించాలి.

శిక్షితులు ఇచ్చిన జవాబులు గమనించాలి. ఇది అనేక ఆలోచనలకి తెర తీస్తుంది.

# 2. కుటుంబం మరియు వంశం నడవడానికి ఎవరు అవసరం?


**విధానం :** అందరికి చిన్న ఫ్లాష్ కార్డుల మీద 1 మరియు 2 అని రాసి ఇవ్వాలి. "1" అంటే కొడుకు అని, "2" అంటే కూతురు అని చెప్పాలి. "1" కొన్ని ఎక్కువ కార్డులు ఇవ్వాలి. "2" అనే కార్డు ఉన్న వారివి ఒక దగ్గరికి, "1" అని కార్డు ఉన్నవారు ఇంకో దగ్గర నిల్చోమని చెప్పాలి. తరువాత "1" అనే వాళ్లు ఒక్కొక్కరు "2" అనే వాళ్లు దగ్గర జోడిగా నిల్చోమని చెప్పాలి. చివరికి కొందరు "1" అంకె వాళ్ళు మిగిలిపోతారు. వారికి పరిష్కారము ఎలా అని ప్రశ్నించాలి. అప్పుడు ఆలోచిస్తారు. ఈ విధానం వల్ల ఆడపిల్లలు తక్కువ అయితే వచ్చే అనర్థాలను తెలుసుకోవచ్చు. ఆడవాళ్లు లేకుండా కుటుంబం నడవదు. అలాగే వంశము నడువదు.

ఆడపిల్లలు తక్కువైతే వచ్చే అనర్థాలను అడిగినప్పుడు రకరకాల జవాబులు వస్తాయి. వంశం ఆగిపోతుంది అని, బాల్యవివాహాలు ఎక్కువైతాయని, మగవాళ్లకు పెళ్లిళ్లు కావని, ఆడవాళ్ళ మీద హింస ఎక్కువౌతుంది అని, ట్రాఫికింగ్ మరియు వ్యభిచారము ఎక్కువైతుంది అని, ఒక్క ఆడపిల్లని ఎక్కువమంది మగవాళ్ళు కలిసి వివాహం చేసుకుంటారని చెబుతారు.

అందుకే ఆడపిల్లలు కుటుంబం మరియు వంశం నడవటానికి అవసరం అని వివరించాలి. ఇంకాస్త విస్తరిస్తే మగవారు ఒక పనిలో నిపుణులుగాను, ఆడవారు ఒకేసారి వేర్వేరు పనుల్లో నిపుణులుగాను వుంటారు. ఇంటా, బయట తనదైన శైలిలో సమర్థంగా రాణిస్తారు.

# 3 భావజాలం ఎవరు తయారు చేస్తారు..?

## జండర్ మూలాలు



**విధానం :** అందరికి చిట్టీలు ఇచ్చి దానిలో ఆడపిల్ల అనగానే ఏమి ఆలోచిస్తారు. మగపిల్లవాడు అనగానే ఏమీ ఆలోచిస్తారో రాయమని అడగాలి. వారు రాసిన తర్వాత వారిని చదువమని చెప్పాలి. దీని ద్వారా ఆడపిల్లలకు మరియు మగపిల్లలకు పుట్టుకతోనే ఎలా వివక్షత చూపిస్తారో మరియు సమాజపరంగా ఎలా చూస్తారో అని అడిగి తెలుసుకోవాలి.

మతం, వర్గం, ప్రాంతం మొదలయినవి స్త్రీ పురుషులకి, పురుషులకి, పురుషులకి మధ్య, స్త్రీలకి, స్త్రీలకి మధ్య వేర్వేరు స్థానాల్ని ఇస్తాయి అని చెప్పాలి మరియు వారి అభిప్రాయం తీసుకోవాలి.

| **శారీరకంగా** | **సామాజికంగా** |
|---|---|
| నిరంకుశ శక్తులుగా పని చేస్తాయి. | స్త్రీ, పురుషులకు వేర్వేరు విలువలు ఆపాదిస్తాయి |

| **పురుషులు** | **స్త్రీలు** |
|---|---|
| 1. శారీరకంగా బలవంతులు | ● శారీరకంగా బలహీనులు |
| 2. వారసత్వపు ఆస్తికి, అధికారానికి వారసులు | ● గృహరంగానికి కావలసిన సంప్రదాయ నైపుణ్యాలు నేర్చుకుంటారు |
| 3. ఎదగడానికి కావలసిన నైపుణ్యాలు అందుబాటులో వుంటాయి | ● పరిమిత వనరులు, విజ్ఞానం అందుబాటులో వుంటాయి |
| 4. వ్యవసాయ ఉత్పత్తి రంగాల్లో అధిపత్యం చెలాయిస్తారు | |
| 5. విస్తృతంగా పర్యటించే అవకాశం వుంది | ● వ్యవస్థాగత రంగాల్లో నామమాత్రపు ప్రాతినిధ్యం వుంటుంది |
| 6. అంచనా, నిర్ణయం వీరే చేస్తారు | |

జండర్ పాత్రలు మరింత పటిష్టంగా పనిచెయ్యడానికి ఇవి పని చేస్తాయి. స్త్రీ పురుషులు నిమిత్త మాత్రులు. కుటుంబం, స్కూలు, ఇరుగుపొరుగు, సమాజం, రాజ్యం, మతం, చట్టం, సమాచార వ్యవస్థ, వివిధ సంస్థలు ఇవే విలువల్ని పోషించడంలో ప్రత్యక్ష పాత్ర వహిస్తాయి. చిహ్నాలు, విలువలు, నమ్మకాలు, భాష, పరోక్షంగా పనిచేస్తాయి. మతం, వర్గం, ప్రాంతం మొదలయినవి స్త్రీ పురుషులకి, పురుషులకి, పురుషులకి మధ్య, స్త్రీలకి స్త్రీలకి మధ్య వేర్వేరు స్థానాల్ని ఇస్తాయి.

# 4 స్త్రీల ప్రత్యుత్పత్తి శక్తిని ఎలా గౌరవిస్తున్నాం..?



**ఫెసిలేటటర్ నోట్ :** ఉత్పత్తి, ప్రత్యుత్పత్తి అంటే ఏమిటి అని అడిగి జవాబులు రాబట్టాలి.

వస్తువుల్ని ఉత్పత్తి చేయడాన్ని ఉత్పత్తి అంటారని, మనుషుల్ని ఉత్పత్తి చెయ్యడాన్ని ప్రత్యుత్పత్తి అంటారని చెప్పాలి.

పురుషులు ఒకే రంగంలో పనిచేస్తున్నారని, స్త్రీలయితే రెండు రంగాల్లో పనిచెస్తున్నారని వివరించాలి.

ఉత్పత్తి రంగంలో వున్నవారికి దొరికే విశ్రాంతి, గౌరవం, వేతనం, ఎదుగుదల, యూనియన్ లాంటివి ప్రత్యుత్పత్తి రంగంలో వున్నాయో లేదో ఆలోచన రేపాలి

మానవజాతిని ఉత్పత్తి చేస్తున్న స్త్రీలకు మన సమాజంలో ఎలాంటి స్థానం వున్నదో ప్రశ్నించాలి.

# 5. మూఢనమ్మకాలు మతి పోగొడతాయని తెలుసా..?

**విధానం :** మగపిల్లవాడు పుట్టాలనే మీకోరికను ప్రోత్సాహిస్తూ కొన్ని శక్తులు సమాజంలో వున్నాయి.

ఉదాహరణకు బాబాలు, ఫలదీకరణ సమయానికి పెట్టుకునే ముహూర్తాలు, తాయెత్తులు, మూలికలు, రంగు రాళ్ళు – ఇవి మీకెప్పుడయినా ఫలితాలనిచ్చాయా..? అని అడగాలి. సహజంగా మిశ్రమ స్పందన వస్తుంది. లేదా తమకు ఇల్లాంటి నమ్మకాలు వున్నట్టు తెలిస్తే చులకన అవుతామని కూడా కొందరు ఏమీ మాట్లాడరు. ఫెసిలిటేటర్ వారందరినీ ప్రోత్సాహిస్తూ, క్లాసులో వున్న సభ్యులందర్నీ ఆ శక్తుల్ని నమ్మేవారు, నమ్మనివారు అని రెండు గ్రూపులుగా స్వచ్ఛందంగా ముందుకు రానిచ్చి ఎ.బి అని పేర్లు పెట్టి చర్చ నడిపించాలి.

ఒక గ్రూపు సమాధానపడేట్టుగా ఇంకొక గ్రూపు జవాబులు చెప్పగలగాలి. దీనికి మార్కులు ఇవ్వగలిగితే బావుంటుంది.

**సూచనలు :** వాదన మొత్తం పూర్తయ్యాక గాని ఫెసిలిటేటర్ తన అభిప్రాయాలు చెప్పకూడదు. నమ్మకాలున్న గ్రూపుని, నమ్మకాలులేని గ్రూపుని సమానంగా గౌరవించాలి. లేకపోతే వారు తమ వాదన వినిపించడానికి ముందుకు రాలేరు.

# ౬. కంసుడి సంస్కృతి ఇంకా వుంది..?

**విధానం :** ఫెసిలిటేటర్ కంసుడి కుటిలనీతి, సోదరి అయిన దేవకీ వసుదేవుల్ని జైలులో బంధించడం ఆమెకు పుట్టిన ఏడుగురు సంతానాన్ని పుట్టిన వెంటనే చంపెయ్యడం గురించి చెప్పాలి. ఈ సెక్స్ సెలక్టివ్ మర్డర్స్ కి కారణమేమిటి అని అడగాలి. ఈ కథను కేవలం ఉదాహరణగా మాత్రమే తీసుకోవడం జరిగింది.

ప్రాణభయం, రాజ్య కాంక్ష, దుర్మార్గ ప్రవృత్తి.. అంటూ కొన్ని కారణాలు చెబుతారు. ప్రతి కారణాన్ని బోర్డు మీద రాయాలి. తర్వాత రాజరికానికి ప్రజాస్వామ్యానికి వున్న తేడా అడగాలి. గ్రూపులుగా చర్చించుకుని ప్రజాస్వామ్యంలో వున్న ప్రాథమిక హక్కులు రాసేలా ఫెసిలిటేట్ చెయ్యాలి.ఈ హక్కులు అందరికీ వున్నాయా..? అని అడగాలి. మరి ఇప్పుడు కూడా జరుగుతున్న సెక్స్ సెలక్టివ్ మర్డర్స్ కి కారణమేమిటి అని రాసి, ఆధునిక కంసుడు అని శీర్షిక కింద వాటిని రాయించాలి.

ఆంధ్రప్రదేశ్‌లో పుట్టిన ఆరు సంవత్సరాల మధ్య వయసులోని పిల్లల లింగ నిష్పత్తి డేటా ప్రదర్శించాలి.


ఈ దుష్ట ప్రక్రియవల్ల పదికోట్ల మంది మహిళలు లేరు . అంటే అది ఒక రాష్ట్ర జనాభాకు సరిపడే జనాభా అని చెప్పాలి.

**ఉద్దేశ్యం :** సెక్స్ సెలక్టివ్ మర్డర్స్ ఎప్పుడయినా కానీ దుష్పరిణామాలకే దారితీసాయని తెలుసుకోవడానికి ఈ పౌరాణిక నేపథ్యం ఉపయోగపడుతుంది.

**పరికరాలు :** చార్టులు, అవసరమయిన సిడిలు, ప్రొజెక్టర్.

గమనిక : ఈ కథను కేవలం ఉదాహరణగా మాత్రమే తీసుకోవడం జరిగింది. కథలో మగపిల్లవాడని భ్రమలో పుట్టిన అందరి ఆడపిల్లలని చంపుతారు. కాని ఇది లింగనిర్ధారణకి సంబంధించినది కాదు. కాని చంపబడ్డది మాత్రం ఆడపిల్లలే. గ్రామస్థాయి కార్యకర్తలకు తొందరగా అర్థమవుతుందని ఉద్దేశ్యంతో మాత్రమే ఉపయోగించాము. కాని ఏ ఇతర కారణాలతో కాదు.

# 7. గర్భస్థ శిశువుకి లింగం ఎలా ఏర్పడుతుంది.




కావలసిన వస్తువులు ఒక ఏభై, ఎర్రపూసలు, పాతిక వరకు నీలం పూసలూ , రెండు ఖాళీ డబ్బాలు , కళ్ళకు గంతలు కట్టడానికి పెద్ద సైజు జేబురుమాలు.

**విధానం :** ఒక ఎరుపు పూసల డబ్బా, ఒక ఎరుపు, నీలం రెండు రంగులూ వున్న పూసల డబ్బా తీసుకోవాలి. (శిక్షితుల సంఖ్యను బట్టి ఈ పూసల సంఖ్య పెరగవచ్చు, తగ్గవచ్చు) రెండు డబ్బాల్ని పక్కపక్కన టేబుల్ మీద పెట్టాలి. ఒక్కొక్క శిక్షితుడ్ని పిలిచి కళ్లకు గంతలు కట్టి తలొక డబ్బాలోంచి తలొక పూసా తీసుకోనిచ్చి తన స్థానానికి వెళ్ళి కూర్చోమని చెప్పాలి. అందరూ వచ్చి తీసుకున్నాక రెండు ఎరుపు రంగు పూసలు ఎవరికి వచ్చాయో, ఒక ఎరుపూ, ఒక నీలం పూసలు ఎవరికి వచ్చాయో లెక్క కట్టాలి. రెండు ఎరుపు పూసలు 'ఎక్స్' క్రోమోజోమ్ అని నీలం పూసలు 'వై' క్రోమోజోములని చెప్పాలి. ఇంత సహజమయిన విషయంలో తల్లిని నిందించడం, వదిలెయ్యడం, మళ్ళీ పెళ్ళిళ్ళు చేసుకోవడం లేదా తల్లీపిల్లల్ని హింసించడం ఇదంతా నేరమని, ఈ నేరం చేసినవారు శిక్షార్హులని చెప్పాలి.

**పరికరాలు** : పూసలు, డబ్బాలు, కళ్ళకు గంతలు కట్టడానికి ఒక జేబురుమాలు

**ఉద్దేశ్యం :** ఈ క్రీడ వల్ల గర్భస్థ పిండ లింగం అనేది మనుషుల ప్రమేయంతో కాక క్రోమోజోమ్స్ వల్ల ఏర్పడుతుంది దాన్ని వ్యతిరేకించడం, మార్చడం చాలా అనాచారమని, అనాగరికత అని తెలుస్తుంది.

# 8.గర్భస్థ పిండాల్లో ఆడ శిశువులే ఎందుకు తొలగించబడుతున్నారు?



**శిక్షితుల మాట :**

లింగ నిర్ధారణ అనేది ప్రస్తుతం దుర్వినియోగ మవుతున్న ఒక సాంకేతిక విధానం మాత్రమే కాదు. అది సమాజంలో స్త్రీల ఉనికికీ, గౌరవానికీ కూడా గొడ్డలి పెట్టు అనదగిన చర్య. పుట్టిన దగ్గరినుంచీ మాత్రమే కాక పుట్టక ముందు నుంచీ అమలవుతున్న వివక్షతకు ప్రత్యక్ష నిదర్శనం. తల్లీపిల్లల్ని ఏక కాలంలో అవమానిస్తున్న అమానుష క్రీడ. పితృస్వామ్య సమాజంలో వున్న ద్వంద్వ విలువలకు తార్కాణం. ఆడపిల్లలు వేరే ఇంటికి వెళ్ళిపోతారని, తమ వంశాన్ని కాక ఇంకొకరి వంశాన్ని నిలబెడతారని రకరకాల కారణాలు చెబుతుంటారు. అంతేకాదు చదువు, ఆరోగ్యం, మానసిక వికాసం లాంటి వాటిమీద కూడా ఏమాత్రం ఖర్చు పెట్టడానికి ఇష్టపడరు. ఆడపిల్లల్ని కన్న తల్లిదండ్రులు వరకట్నం, పెళ్ళిఖర్చు, భద్రత లాంటి బాధ్యతలు భరించాల్సి వస్తుందని బాల్యవివాహాలు చేసి పంపేస్తారు. అమ్మడం, కొనడం, వ్యభిచారం లాంటివి సామాజిక రుగ్మతలుగా ఆడపిల్లల్ని మనుషులుగా కాక సరుకుగా చూడడం వల్లనే జరుగుతాయి. అంటే కుటుంబాలు, సమాజాలు ఆడ సంతానాన్ని పరాయీకరణకు గురిచేస్తారు. ఇదే మనుషులు మళ్ళీ స్త్రీలు కరుణా హృదయులుగా వుండాలని, కుటుంబంకోసం త్యాగాలు చెయ్యాలనీ, మాతృమూర్తులుగా వుండాలనీ ఆశిస్తారు. సామాజిక లోపాలు వ్యక్తిగత భయాలు బాధ్యతా రాహిత్యాలు కలిసి మొత్తానికి ఆడపిల్ల ఉనికినే లేకుండా చేస్తున్నాయి.

ఇది బాగా అర్ధమయేందుకు ఏది వ్యక్తిగతం, ఏది సామాజికం అనే అంశాల్ని గురించి చెప్పాలి.

అందుకు సంబంధించిన ప్రశ్నావళి :

**ఏది వ్యక్తిగతం ? ఏది సామాజికం ?**

1. ఆడపిల్ల వద్దు అనుకోవడం......?
   వ్యక్తిగతం - సామాజికం
2. ఆడపిల్ల పట్ల వివక్ష చూపడం..?
   వ్యక్తిగతం - సామాజికం
3. ఆడపిల్లను మైనస్ అని, మగపిల్లల్ని ప్లస్ అని అనడం....?
   వ్యక్తిగతం - సామాజికం
4. రక్షణ లేదనే భయంతో ఆడపిల్లను ఇంట్లోనే బంధించడం....?
   వ్యక్తిగతం - సామాజికం
5. పుట్టిన ఇద్దరు పిల్లల్లో ఆడపిల్లకు ఒకరకం, మగపిల్లవాడికి ఒకరకం ఆట వస్తువులు ఇవ్వడం..
   వ్యక్తిగతం - సామాజికం
6. గర్భంలో వున్న శిశువును ఆడో మగో తెలుసుకోవడానికి ఏ రకంగా ప్రయత్నించినా....
   వ్యక్తిగతం - సామాజికం
7. ఆడపిల్లను కన్నందుకు తల్లిని ఆమె పుట్టింటి వారిని గాని నిందించడం, అదనపు కట్నం అడగడం....
   వ్యక్తిగతం - సామాజికం
8. మగపిల్లవాడే పుట్టాలని చేసే అన్ని ప్రయత్నాలు, నమ్మకాలు.....
   వ్యక్తిగతం - సామాజికం
9. ఆస్తి పంపకంలో ఆడపిల్లకు మగపిల్లవాడికి సమాన న్యాయం పాటించకపోవడం.....
   వ్యక్తిగతం - సామాజికం
10. మానసిక వికాసానికి సంబంధించిన అంశాల్లో అమ్మాయికి , అబ్బాయికి వేర్వేరు ధోరణులు ప్రదర్శిస్తే..
    వ్యక్తిగతం - సామాజికం
11. ఆహార, వస్త్ర, విద్యావకాశాల్లో తేడా చూపిస్తే...
    వ్యక్తిగతం - సామాజికం
12. ఇంట్లో పనులన్నీ అమ్మాయిలే చేయాలి, అబ్బాయిలు చేయకూడదు అనే భావజాలం...
    వ్యక్తిగతం - సామాజికం
13. సామాజిక, మత కార్యక్రమాల్లో ఆడపిల్లకు సమాన ప్రాతినిధ్యంలేకపోతే....
    వ్యక్తిగతం - సామాజికం
14. ఏ బాలికకు అయినా భావ వ్యక్తీకరణకు అడ్డుపడేవన్నీ ......
    వ్యక్తిగతం - సామాజికం

**పరికరాలు :** ప్రశ్నలు , చార్టులు, మార్కర్ పెన్స్

**విధానం :** ప్రశ్నలన్నిటికి జవాబులు రాయించి వారి అవగాహనని అంచనా వెయ్యాలి.

# 9. ఈ నేరం మీరూ చేశారా..? ఆలోచించండి..?

**విధానం :** యాక్షన్ ఎయిడ్ వారి డాక్యుమెంటరీ ఫిల్మ్ ప్రదర్శించాలి.

వారి అభిప్రాయాల్ని స్పందనల్ని ఆహ్వానించాలి.

ఇటువంటి సంఘటన నా ఇంట్లో, నాస్నేహితుల ఇంట్లో, బంధువుల ఇంట్లో జరిగింది. అప్పుడు నేను..........

- ఇది నేరమని తెలీక ప్రోత్సాహించాను...........
- మౌనం వహించాను.............................
- వ్యతిరేకించాను

అని మూడు మల్టిపుల్ జవాబులు ఇచ్చి, క్లాసుని మూడు గ్రూపులుగా విడదీసి చర్చించి కారణాలను చార్టు మీద రాసి క్లాసులో ప్రెజెంట్ చేయాలి.

**పరికరాలు :** డాక్యుమెంటరీ సిడి, ప్రొజెక్టరు, చార్టులు, పెన్స్

**ఉద్దేశ్యం :** ఎవరికి వారు ఆత్మవిమర్శ చెసుకోవడానికి ఉపయోగపడుతుంది.

# 10. గర్భస్థ శిశు ఆరోగ్య పరీక్షకూ, గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షకూ వున్న తేడా

**ఫెసిలిటేటర్ వాక్యం :**

గర్భస్థ శిశువు ఆరోగ్యం తెలుసుకోవడం అనేది కొన్ని ప్రత్యేకపరిస్థితుల్లో అవసరం అవుతుంది.

అవి ఎలాంటివంటే ...

- గర్భవతికి 35 సంవత్సరాలు దాటినప్పుడు,
- రెండుకన్నా ఎక్కువసార్లు గర్భస్రావం జరిగినప్పుడు,
- గర్భవతి కేన్సర్ కారక మందులు, రేడియేషన్ , వ్యాధికారక క్రిములు లేక రసాయనిక ప్రభావాలకు లోనైనప్పుడు,
- గర్భవతి లేదా ఆమె భర్త కుటుంబంలో బుద్ధి మాంద్యం, ఎపిలెప్సి, శారీరక వైకల్యం, జన్యుపర వ్యాధుల చరిత్ర ఉన్నప్పుడు,
- కేంద్ర పర్యవేక్షక బోర్డు పేర్కొన్న ఇతర జన్యుపర వ్యాధులు గర్భవతికి వున్నప్పుడు,
- ఏకారణంగా పరీక్షలు జరుపుతున్నారో వాటిని నిర్వహించే వ్యక్తి రాత పూర్వకంగా రికార్డు చెయ్యాలి. ఈ పరీక్షలు చేయించుకోవడానికి గర్భవతి నుండి ఆమె అర్థం చేసుకోగలిగిన భాషలో రాత పుర్వకంగా అనుమతి తీసుకోవాలి.
- ఈ పరీక్షలు చేసిన వ్యక్తి కానీ, ఇతరులు కానీ గర్భస్థ శిశువు ఆడో, మగో గర్భవతికి గానీ, ఇతరులకు గానీ మాటలతో, సైగలతో ఇతర పద్ధతుల్లో తెలియ జెయ్యకూడదు.

**విధానం :**

క్లాసులోని శిక్షితుల్ని అయిదుగురు చొప్పున కొన్ని గ్రూపులు చేసి పెద్ద చార్టుమీద ఈ తేడా టేబుల్ రూపంలో రాసి క్లాసుముందు ప్రెజెంట్ చేయమని చెప్పాలి.

| గర్భస్థ శిశు ఆరోగ్య పరీక్షకు కారణాలు | గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షకు కారణాలు |
|---|---|
| 1) జన్యులోపాలు లేదా జీవ క్రియల సంబంధిత వ్యాధులు | అడశిశువుల పట్ల వివక్ష |
| 2) క్రోమోజోముల వైపరీత్యాలు | సామాజిక బాధ్యత లేకపోవడం |
| 3) హిమోగ్లోబిన్ సంబంధిత వ్యాధులు | పితృస్వామ్య భావజాలం |
| 4) పుట్టుకతో వచ్చే లైంగిక వ్యాధులు | భవిష్యత్తులో జరగబోయే విపత్తు తెలీకపోవడం |
| 5) కేంద్ర పర్యవేక్షక బోర్డు పేర్కొనే ఇతర వైకల్యాలు, వ్యాధులు | |
| గర్భవతి వయసు 35 సంవత్సరాలు | |

**పరికరాలు :** ఇవ్వదల్చుకున్న రాత ప్రతులు / మెటీరియల్

**ఉద్దేశ్యం :** దీనివల్ల చట్టం ఎలా దుర్వినియోగం అవుతున్నదో అర్ధమవుతుంది.

# 11. కడుపులో చిన్నారిని ఎలా కాపాడుకుందాం..?

**విధానం :** శిక్షితులందరిని వలయాకారంలో నిల్చోమనాలి. వలయంలోపల ఒకరు కోడిపిల్లలాగానూ వలయం బైట ఒకరు గద్దలాగానూ వుండాలి. గద్ద కోడిపిల్లను ఎత్తుకుపోకుండా కోడిపిల్ల చుట్టూ వున్నవారు రక్షణ కల్పించాలి. గద్దవచ్చె కోడి పిల్ల .. కుయ్యోం..కుయ్యోం అని అరుస్తూ ఈ ఆట ఆడాలి.

ఈ ఆటద్వారా ఏం తెలిసిందని ప్రశ్నించాలి..?

**ఫెసిలిటేటరు నోట్ :** వలయంగా నిల్చున్నవారందరు తల్లి గర్భంతోనూ, కోడిపిల్ల గర్భస్థ పిండంగానూ వెంటాడే గద్ద కోడినెత్తుకుపోయే భావజాలంగానూ ఊహించమనాలి. తర్వాత వలయంలో నుంచున్నవారంతా బిడ్డను కాపాడగలుగుతున్నారా? అని అడగాలి. కన్న తల్లిదండ్రులే బిడ్డల్ని చంపడాన్ని ఏమనాలి ? అని అడగాలి.

**పరికరాలు** ఏమీ అవసరంలేదు.

**ఉద్దేశ్యం :** ఈ ఆట సరదాగా ప్రారంభమయినా కానీ, క్రమ క్రమంగా ఒక భావోద్వేగంతో కూడిన నిబద్ధత వస్తుంది. ఆడపిల్లల్ని రక్షించుకోవాలనే తాపత్రయం పెరుగుతుంది.

# 12. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎలాంటి శిక్షలు వుంటాయి..?

**విధానం :** క్లాసులోని వారిని ఈ ప్రశ్న అడిగి వారు చెప్పిన జవాబులు బోర్డు మీద రాసి తర్వాత ఈ మెటీరియల్ ఇవ్వాలి. మీకు దగ్గరవున్న కేంద్రాల్లో ఈ నిబంధనలన్నీ అమలవుతున్నాయా అని అడగాలి. గ్రూపులుగా కూర్చోపెట్టి చదివించి అమలులో వున్న లోపాలు చార్టు మీద రాయించాలి.

- లింగ నిర్ధారణ ఎంపికకు సంబంధించిన సదుపాయాల గురించి ఏ రూపంలో అయినా వ్యాపార ప్రకటనలు, సమాచారం జారీ చేసినా, ఎటువంటి లింగ నిర్ధారణ ప్రకటనలు ప్రచురించినా, పంపిణీ చేసినా మూడు సంవత్సరాల వరకు జైలు, పదివేల వరకు జరిమానా విధించవచ్చు.
- లింగ నిర్ధారణ, మరియు ఎంపికకు సహకరించిన, సేవలందించిన, కేంద్రాల యజమానులు, ఉద్యోగులు మొదటిసారి నేరానికి మూడు నెలలవరకు జైలు, పదివేల రూపాయలవరకు జరిమానా , రెండవసారి నేరానికి అయిదు ఏళ్లవరకు జైలు, యాభై వేల రూపాయలవరకు జరిమానా విధించవచ్చు.
- పై నేరాలకు డాక్టర్ల రిజిస్ట్రేషను రద్దు చేయవచ్చు. కోర్టులో నేరం రుజువయితే, మొదటిసారి నేరానికి అయిదు సంవత్సరాల పాటు, రెండవసారి నేరానికి శాశ్వతంగా రిజిస్ట్రేషన్ రద్దు చెయవచ్చు.
- చట్టం అనుమతించిన కారణాల కోసం కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వ్యక్తులు, వృత్తి నిపుణులు వైద్యులకు మొదటిసారి నేరానికి మూడు సంవత్సరాల జైలు, యాభైవేల జరిమానా, రెండవసారి నేరానికి అయిదు సంవత్సరాల జైలు, లక్ష రూపాయల జరిమానా విధిస్తారు.
- బలవంతం మీద ఈ పరీక్షలు చేయించుకున్న మహిళను నేరస్థురాలిగా పరిగణించరు.
- అందుకు వ్యతిరేకంగా రుజువయితే తప్పించి గర్భిణీ స్త్రీ భర్త, అతడి బంధువులు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని బలవంతం చేశారని కోర్టు భావించి, నేరస్థులుగా పరిగణించి శిక్షిస్తుంది. ఈ మెటీరియల్ మీద సభికుల్ని చర్చకు ఆహ్వానించవచ్చు.

**జన్యు పరిధిలోకి వచ్చే కేంద్రాలు**

- జన్యుక్లినిక్
- జన్యు ప్రయోగశాల (అల్ట్రాసౌండ్ యంత్రం, ఇమేజింగ్ యంత్రం, లేదా స్కానర్ మరియు ఇతర పరికరాలు)
- సంతాన సాఫల్య కేంద్రాలు

ఈ కేంద్రాలన్నీ నమోదు అయి వుండాలి.

**ఉద్దేశ్యం :** తమ గ్రామంలో కొనసాగుతున్న విధాన వైఫల్యాలు వెలుగులోకి వస్తాయి

# 13. సుప్రీం కోర్టు వెలువరించిన మార్గదర్శకాలు

**విధానం :** సుప్రీకోర్టు వెలువరించిన మార్గదర్శకాల్ని శిక్షితులకు ఇచ్చి, దాని క్రింద వున్న ప్రశ్నలకు జవాబులు రాయమని అడగాలి. ఎవరికయినా అర్థంకాకపోతే చెప్పాలి.

# 14 ఎంత పెద్ద ప్రయాణమయినా ఒక అడుగుతోనే మొదలవుతుంది.

కార్యాచరణ ప్రణాళిక




ఫెసిలేటర్ నోట్ :

ఉదయం నుంచీ మనం అన్నీ సమస్యలగురించే మాట్లాడుకున్నాం. మార్పు కోసం పనిచేసే కార్యకర్తలుగా మనం కొన్ని పనులు చేయగలం. అవి ఏమిటో మాట్లాడుకుందాం. పరిస్థితులకు భయపడి మౌనం వహించే పద్దతి ఇక మానేద్దాం. మౌనం కూడా నేరం లాంటిదే.

- మన వాడలో/ పేటలో ఎవరయినా గర్భస్థ పిండాల్ని లింగ నిర్ధారణకోసం ప్రయత్నిస్తూ వుంటే వారికి మొదట నచ్చజెప్పండి, తర్వాత అడ్డుకోండి. ఇంకా వినకపోతే సంబంధిత అధికారులకు తెలియజేయండి. అధికారులు కఠినచర్య తీసుకునేదాకా నిద్రపోకండి.
- ఈ విషయంలో మీరు సాధించిన విజయాల్ని పత్రికలకు రాయండి. దీనివల్ల మీ పట్ల ప్రజలకు నమ్మకం గౌరవం పెరుగుతాయి.
- ఇంటిలో చక్కటి పాపాయిల బొమ్మలు, కాలండర్లు తగిలించండి. రోజూ వాటిని చూడ్డంవల్ల ఒక మానసిక అనుబంధం పెరుగుతుంది. వారంతా భవిష్యత్తులో కాబోయే తల్లులని అందరికీ చెప్పండి.

- ఆడ పిల్లల్ని తక్కువజేసే శోక భాష కానీ, అద్భుతీకరించే దేవతల శ్లోకాల భాష కానీ మానెయ్యండి. మనుషుల్లా చూడండి.
- మీ సమీపంలో వున్న వెల్ఫేర్ అసోసియేషన్ లో సభ్యత్వం తీసుకోండి. మీలాగా మార్పు కోరుకున్నవారితో ఒక గ్రూపుగా మారండి.
- మత సాంఘిక కార్యక్రమాలు జరిగే చోట మాట్లాడేటప్పుడల్లా గర్భస్థ శిశు ఎంపిక నేరం అని చెప్పండి.
- మీ గ్రామంలో, జిల్లాలో, పట్టణంలో లింగ నిష్పత్తి తగ్గకూడదని తీర్మానించండి.
- కన్న కూతురి దృష్టిలో మీ స్థానం గౌరవప్రదంగా వుండేలా చూసుకోండి. తెలియక ఎప్పుడయినా బాధ పెడితే సారీ చెప్పండి.
- వరకట్నం, అత్యాచారం లాంటి సామాజిక రుగ్మతలకి మనమే కారణమని, పుట్టిన పసికందులు కారని తెలుసుకోండి. అది అందరికీ కూడా చెప్పండి.
- మీ జాగృతి వల్ల మానవ జాతి తల్లిలేని జాతి అయ్యే ప్రమాదం నుంచి బయటపడుతుందని అర్థంచేసుకోండి.

**విధానం :** శిక్షితులను ఒక యాక్షన్ ప్లాన్ తయారు చెయ్యమని అడగండి. క్లాసులోని సభ్యుల సంఖ్యను బట్టి అయిదారు గ్రూపులు చేసి చార్టులమీద ప్లాన్ ఒకటి రెండు, మూడు అని నంబర్లు వేసి రాయించండి. అనంతరం...

రాసిన విషయాలకు కట్టుబడి వుంటామని, ఇక మీదట,

"నా ఇంటిలో, బంధువుల, స్నేహితుల ఇళ్లలో సమాజంలో ఎక్కడయినా సరే ఈ నేరాలు జరగకండా చూస్తాను."

అని అందరి ముందూ చెయ్యి చాపి వాగ్దానం చెయ్యాలి.

**ఉద్దేశ్యం :** దీని వల్ల శిక్షితులకు పూర్తి స్థాయి అవగాహన మాత్రమే కాక తను ఏం చేయగలదో ప్రకటించడం జరుగుతుంది. ఈ అంకిత భావం కొందరిలో బాగా పనిచేస్తుంది.